


# పెంకుటిల్లు

**రష్యన్ మూలం: చెహోవ్**
**తెలుగు గొంతు: కరుణారుణ**



పాత పెంకుటింటిని పడగొట్టి అపార్టుమెంట్లు కట్టించాలని ఆర్కిటెక్టుకు చూపించాను. కొలతలు తీసుకున్నాక ఆ ఇంట్లో ఒక్కొక్క ఖాళీగది గురించీ వివరించాను.

పాడుబడినట్టుగా వున్న గదులు. సాలెగూళ్లు. దుమ్మూ, దుమారం. విరిగిన కర్రముక్కలు. ఊడివస్తున్న కిటికీ రెక్కలు. పొయ్యిరాళ్లలో యింకా మిగిలివున్న బూడిద, బొగ్గులు నిన్న మొన్నటిదాకా మనుషులిక్కడ సంసారాలు చేశారనటానికి నిదర్శనాలు. ఉదాహరణకు యిక్కడే మెట్లమీద తప్పతాగిన మనుషులు నీ శవాన్ని మోసుకొస్తూ యిక్కడే మెట్లమీద గాయాలయినాయి గాని శవం మొహం మీద చిరునవ్వు చెరగలేదు. ఈ వరుసగదులన్నీ చూశావా, ఇందులో వున్న ఆడపిల్లలకోసం పురుషులు రాత్రిళ్లు వచ్చి వెళుతుండేవాళ్లు. ఈ ఆడపిల్లలు పేదవాళ్లే. కాని ఆకర్షించడం కోసం అందంగా అలంకరించుకునేవాళ్లు. ఆ చివరి గదిలో ఓ చాకలి మనిషి ఉండేవాడు. రోజంతా చాకి రేవుకెళ్లేవాడు. రాత్రిళ్లు నాటుసారా అమ్మేవాడు.

ఇన్నేళ్లలో యిక్కడ అద్దెకున్న వాళ్లెందరో కాలం చేశారు. ఒక దశలో ఎంత ఎక్కువగా మరణించారంటే, వాళ్లతో పాటు మృత్యువుకూడా యిక్కడే కాపురముందా అనిపించింది. ముఖ్యంగా, ఒక్క కుటుంబాన్ని గురించి మాత్రం తప్పక చెప్పాలి. పుటోకిన్ అనే ఒకతను నోటరీ దగ్గర పనిచేసేవాడు. ఎక్కువ సంపాదనేమీ లేదు కాని అద్దె మాత్రం ప్రతి ఫస్టుకూ నిక్కచ్చి తెచ్చేవాడు. డబ్బుకు నేను రసీదిస్తుంటే, 'అబ్బే, యిదెందుకండీ' అనేవాడు. చెప్పానుగదా. సంపాదన అట్టే లేకపోయినా యింటిల్లిపాదీ శుచిగా, శుభ్రంగా వుండేవాళ్లు. ఇల్లుకూడా నీట్‌గా వుండేది. పుటోకిన్ తన పోర్షన్‌లోని ఓ గదిని మెంగోరిచ్ అనే కమ్మరి మనిషికి అద్దె కిచ్చుకున్నాడు. మెగోరిచ్ మంచివాడే గానీ తాగుబోతు. కమ్మరి పని మాత్రమే గాక, తాళాలూ, సైకిళ్లూ మరమ్మత్తూ చేస్తుండేవాడు. ఆ గదినిండా ఎప్పుడు చూసినా యినుపముక్కలూ, రిపేరు సామాన్లూ, మండుతున్న కొలిమి.

ఈ ఇంటికి వచ్చినప్పుడల్లా నాకు కనిపించిన దృశ్యం యిదే. ముందరిగదిలో దస్తావేజులు కాపీచేస్తూ, టేబుల్ ముందర పుటోకిన్, అతడి ముసలితల్లీ, అస్తిపంజరం లాంటి అతడి భార్యా,

పక్కగదిలో కొలిమి ముందర నిప్పు ఎగదోస్తూ మెగోరిచ్. వంట పదార్థాల వాసనా, పిల్లల పీతిగుడ్డల వాసనా. ఎప్పుడూ వేడిగా వుండే మెగోరిచ్ గదిలో తాగుడు వాసన. కాని, కూలీ నాలీ చేసుకు బతికే పేదవాళ్ల యిళ్లలో మరేం వాసనలొస్తాయి! దుస్తులు వేసుకొని, చక్కగా తలదువ్వుకొన్న పిల్లలు ఆడోమా పరుగెత్తుతూ కనిపించేవారు.

ఈ సుఖ సంసారంలో ఒకనాడు ముందరిగదిలో పుటోకిన్ భార్య శవాన్ని వూహించుకోండి. అందరూ పోయేవాళ్లే. కాని నలుగురు చిన్నపిల్లల్తో, తల్లితో పుటోకిన్. అద్దివ్వకుండానే అక్కడ కాపరం చేస్తున్న మరో జీవిని గురించి చెప్పాను గదూ. ఆ మృత్యువు ఎప్పుడూ మెగోరిచ్ మొహంలో తాండవిస్తూ వుంటుంది. నాకు అసలే మూఢనమ్మకాలు జాస్తి. అద్దెవాళ్లతో ఈ నలభై ఏళ్లుగా వున్న పరిచయం దాన్ని మరింత పెంచింది. ఒకసారి కష్టాలు ప్రారంభమైనాయా. ఇంక వాటికి అంతుండదు. కష్టాలు కొండ చరియల్లాంటివి. ఒకటి విరిగిందా, అన్నీ విరుగుతాయి ఒకదాని వెంట ఒకటి.

భార్యా వియోగం సంగతి ఎలా వున్నా మరో వారం రోజుల్లో నోటరీ అతణ్ణి వుద్యోగంలోంచి తొలగించాడు. పుటోకిన్‌కు తను చేసిన తప్పేమిటో తెలియదు. నిష్కారణంగా ఉద్యోగం పోయింది. తరువాత ఏమవుతుంది? తాగుడు అలవాటవుతుంది. తప్పతాగి యింటికొచ్చి పిల్లల్ని చావబాదుతాడు. మెగోరిచ్ అతడితో కలిసి తాగుతాడు.

ఈసారి పుటోకిన్ అద్దె పద్దెనిమిది రోజులు ఆలస్యంగా యిచ్చాడు. ఆలస్యానికి 'సారీ' కూడా చెప్పలేదు. రసీదు యిచ్చినప్పుడు 'యిదెందుకండీ' అనలేదు. మూడోనెల అసలు అద్దె రానేలేదు. ఆ తర్వాత 'శుచిగా, శుభ్రంగా వుండే పుటోకిన్‌లు చాలా 'కంగాళీ'గా బతుకుతున్నారని కంప్లెయింట్స్ కూడా వచ్చాయి.

ఇలా వూహించుకోండి. ఒక చలికాలం ఉదయం. రాత్రంతా తాగుడుతో మొహం వుబ్బిపోయిన మెగోరిచ్ కొలిమి ముందర కూర్చున్నాడు. మురికి గదిలో పుటోకిన్, పిల్లలూ టీలు తాగుతున్నారు. చలికి గడ్డకట్టుకుపోతున్నా యిప్పుడు వాళ్లకు బొంతలూ, బ్లాంకెట్లూ లేవు. ఉన్న గుడ్డలు కూడా చింకి పాతవైపోయాయి.

'త్వరగా స్కూలుకెళ్లిరా' అంటోంది పుటోకిన్ తల్లి పెద్దమనమడితో.

కుర్రాడు స్కూలు బ్యాగు తీసుకుని 'చలికోటు ఏదీ?' అంటూ అడిగాడు. అవును. చలికోటేది? అది లేకుండా ఈ ఎముకలు కొరికే చలిలో బయటికెలా వెళ్లడం?

గదంతా కలియ వెతికారు చలికోటు కోసం. అదేమన్నా గుండుసూదా కనిపించకపోవటానికి. స్కూలు కుర్రాడికీ, వాడి నాయనమ్మకూ అర్థమైంది. పుటోకిన్ మాత్రం తనకేం పట్టనట్టుగా కూర్చున్నాడు.

'సారాకొట్లో సారా వూరికే పొయ్యడు' అన్నాడు మెగోరిచ్ పుటోకిన్‌ను చూస్తూ. అవును. పుటోకిన్ ఏం చెబుతాడు? నిషా యింకా దిగలేదు. చలికోటు తర్వాత కుర్రాడి కంపాసుబాక్సులు, పెన్నులూ, పుస్తకాలూ కూడా మాయమయ్యాయి.

స్కూలుకెళ్లే కుర్రాడికి చాలాసార్లు ఏడవాలనిపించింది. కాని ఏడిస్తే తండ్రికి కోపమొస్తుంది. కోపంవస్తే కొడతాడు. అప్పుడు నానమ్మ అడ్డు వస్తుంది. కాని నానమ్మకు కూడా దెబ్బలు తగుల్తాయి. మెగోరిచ్ వస్తాడు. నాన్నా, మెగోరిచ్ ఘోరంగా కొట్టుకుంటారు. అప్పుడు నాన్న, మెగోరిచ్. నానమ్మా అందరూ కలిసి ఏడుస్తారు. పక్కిళ్లవాళ్లు వచ్చి 'న్యూసెన్సు' చేస్తున్నందుకు అందర్నీ కలిపి తిడతారు.

ఆ స్కూలు కుర్రాడు ఏడవక పోవటానికి కారణం అదీ. బాధ చూడలేక నానమ్మ కప్పుకున్న శాలువా వాడికిచ్చి స్కూలుకు పంపింది. ఆ ముసల్దానికీ, కుర్రాడికీ కూడా తెలుసు తమ జీవితాలెప్పుడో నాశనమైనాయని.

ఇప్పుడాయింట్లో ఎవరూ ఏడవరు. కొడుకు స్కూలుకెళ్లగానే పుటోకిన్ కూడా బయట కెళ్లాడు.

> ## యుద్ధానికి వ్యతిరేకప్రదర్శన?!
>
> ఇరాక్ మీద అమెరికా ప్రకటించిన యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రదర్శనలు జరిగాయి. ఆస్ట్రేలియాలో మాత్రం ఓ వింతైన ప్రదర్శన జరిగింది. అమెరికాలోని 750 మంది మహిళలు పూర్తి నగ్నంగా రోడ్ల మీద పడ్డారట. 'నో వార్!' అనే నినాదాలున్న బోర్డుల మీద నాలుగు వైపులా హృదయాకారాలు చిత్రించి, యుద్ధాన్ని ఆపు చేసేందుకు ప్రయత్నించమని, ఆస్ట్రేలియా ప్రభుత్వం వారికి సందేశాలిచ్చారట. ఇదో హాట్ షాట్ అయింది కదూ?
>
> ఎస్.

చలి. ఎముకలు కొరికే చలి. కొడకును పిలిచి, బుజ్జగించి, గుండెలకు హత్తుకొని, పాపిష్టి తండ్రిని క్షమించరా కన్నా' అనాలనివుంది పుటోకిన్‌కు. కాని అతడికి దుఃఖం గొంతుకలోనే ఆగిపోతుంది. కుర్రాడి స్కూలు దగ్గరపడగానే షాలు తీసి దాచుకుంటాడు తోటి పిల్లలను ఆడవేషం వేసుకున్నాడని ఏడిపించకుండా వుండాలని.

పుటోకిన్ తన పాపాలకు ప్రాయశ్చిత్యం చేసుకోవాలనుకుంటాడు. జీవితంలో యింకెప్పుడూ తాగకూడదు. ఒక్క చుక్క ముట్టితే ఒట్టు.

నలభై ఏళ్లుగా యిలాంటి వాళ్లనెందర్ని చూడలేదు నేను.

'పుటోకిన్. నీకు నిష్కృతి లేదు. నువ్వు చేసిన ఏ వాగ్దానమూ నిలబెట్టుకోలేవు.'

కొడుకును దగ్గిరకు తీసుకొని, 'ఒరేయ్ నాన్నా, నేను మళ్లీ ఉద్యోగం చేస్తాను. నిన్ను చదివిస్తాను. మంచి స్కూలుకు పంపిస్తాను. ట్యూషన్లు చెపిస్తాను. నువ్వు పెద్ద ఆఫీసరవుతావు. కలెక్టరవుతావు' అంటారు. అవి ప్రగల్భాలు కావు. పుటోకిన్‌కు నిజంగానే తన కొడుకును కలెక్టర్ను చెయ్యాలని వుంది. కాని ఆ సాయంత్రం ముసలితల్లి, రోజంతా ఎక్కడెక్కడో చాకిరీ చేసి ఇరవై కోపెక్కుల బిళ్లలతో యింటికి రాగానే, దాహార్తిని ఆపుకోలేక పుటోకిన్ బైటకెళ్లి తప్పతాగి తూలుతూ యింటికొచ్చి పడిపోయాడు. ప్రతిసారీ, తాగిన మర్నాడు పుటోకిన్ పశ్చాత్తాపపడతాడు. జీవితంలో యింకెప్పుడూ ఒక్క చుక్క కూడా ముట్టకూడదని భీష్మ ప్రతిజ్ఞలు చేసుకుంటాడు. పిల్లలకు బంగారు భవిష్యత్తును చూపిస్తానని ఆశ పెడతాడు. కాని యిది అందరికీ తెలిసిన కథే. పుటోకిన్ పరాజితుడు. తాగుడు బలహీనత అతణ్ణి కబళించివేసింది.

మరోరోజు పుటోకిన్, మెగోరిచ్ కలిసి సారాకొట్టుకెళ్లినప్పుడు నానమ్మ షాలు కూడా మాయమయ్యింది.

ఈ ఇంటి గురించి చెప్పటానికి యింకా ఏమీ లేదు. షాక్ తీసుకుపోయిన పుటోకిన్ యింటికి తిరిగిరాలేదు. గుండెపగిలిన ముసల్ది మంచం పట్టింది. పిల్లల్లో కొందరు అనాథాశ్రమంలో చేరారు. కొందర్ని ఎవరో పెంపుడు తీసుకున్నారు. తండ్రి కలెక్టరు గిరీ కల చూపిన పెద్ద కుర్రాడు ఒక లాండ్రీలో పనికి కుదిరాడు. ఆ గొడ్డు చాకిరీకి తట్టుకోలేక తాగుడు అలవాటు చేసుకున్నాడు. వయసులో వున్నాడేమో, ఆడపిల్లల దగ్గరకు వెళ్లే ప్రయత్నంలో బ్రోకరుగా తయారయ్యాడు.

తర్వాత? ■